యూరియా కోసం తప్పని నిరీక్షణ..!

- సీజన్ వచ్చి మూడు నెలలైనా అందుబాటులోకి రాని ఎరువు
- మరోవైపు ఎరువుల కొరత లేదంటూ అధికారుల ప్రకటనలు
- తహసీల్దార్, ఎంపీడీవో, ఏవో, ఎస్ఐలతో గ్రామసభలు


రాజాంలో పోలీసుల సహాయంతో అరకొరగా యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట : యూరియా కొరత రైతులను వెంటాడుతోంది. పగలనక, రాత్రినక యూరియా కోసం రైతులు రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమై మూడు నెలలైనా రైతులకు అవరమైన యూరియా అందుబాటులో ఉండడం లేదు. వచ్చిన కొద్దిపాటి యూరియాను పోలీసుల సహకారంతో రైతులకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేస్తున్నారు. ఖరీఫ్‌లో దమ్ములో వేయడానికి యూరియా అందుబాటులో లేకపోగా.. వరినాట్లు వేసి నెల రోజులు దాటినా నేటికీ యూరియ దొరక్కపోవడంతో పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు యూరియా అందుబాటులోనే ఉందంటూ అధికారులు ప్రకటనలు చేస్తుండడం గమనార్హం.

ఒక గ్రామంలో 500 మంది రైతులుంటే 150 నుంచి 200 మంది రైతులకు ఒక బస్తా చొప్పున అందించి రైతులందరికీ యూరియా అందినట్లు లెక్కలు చూపిస్తున్నారు. మరో వైపు తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ, వ్యవసాయాధికారులను గ్రామాలకు పంపించి గ్రామ సభలు నిర్వహించి, రైతులంతా ఎక్కువగా యూరియా వాడుతున్నారని, ఇది హానికరమని బెదిరింపులకు దిగుతున్నారు. ఇన్నాళ్లు రైతులంతా వ్యవసాయం చేయడం లేదా? పశువులకు పశుగ్రాసం పెంచి పాలు తీయడం లేదా? సరుగుడు తోటలు పెంచడం లేదా? అని పలువురు రైతులు ఆక్షేపిస్తున్నారు. వాస్తవానికి గతంలో కంటే ఇప్పుడే పంటలకు గిట్టుబాటు ధరలు లేవని సాగు విస్తీర్ణాన్ని రైతులు తగ్గించారు. గతంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఐదు లక్షలు టన్నులు క్రషింగ్ చేసేది. బుచ్చెయ్యపేట మండలంలో సుమారు 7 వేల ఎకరాల్లో చెరకు తోటలు పెంచగా 35 వేల టన్నులు వరకు గోవాడ ఫ్యాక్టరీకి సరఫరా చేసేవారు. ప్రస్తుతం రైతులకు గిట్టుబాటు ధర లేక 5 వేల టన్నులు కూడా చెరకును రైతులు పండించడం లేదు.

గతంలో రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు విరివిగా యూరియా దొరకగా.. నేడు పంట విస్తీర్ణాలు తగ్గినా యూరియా అందుబాటులో ఉండటం లేదు. నాలుగైదు ఎకరాలు ఉన్న రైతుకు ఒక్క యూరియా బస్తా అందించగా.. పలువురు రైతులకు ఒక కట్ట కూడా అందకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేపీ అగ్రహారంలో సుమారు 250 మంది రైతులుండగా.. యూరియ కోసం 200 మంది రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోగా 90 మందికి ఒక బస్తా చొప్పున అందించారు. ఇంకా 110 మంది రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. రాజాం రైతు సేవా కేంద్రంలో 500 మంది రైతులు పేర్లు నమోదు చేసుకుని యూరియా కోసం ఎదురుచూస్తున్నారు. చింతపాక, చిట్టియ్యపాలెం, కరక, సీతయ్యపేట గ్రామాల్లో సుమారు 2 వేల మంది రైతులుండగా.. చింతపాక రైతు సేవా కేంద్రంలో 267 మందికి బస్తా చొప్పున అందజేశారు. లోపూడి, శింగవరం గ్రామాల రైతులకు యూరియా అందలేదు. పలు గ్రామాల్లో సగానికి పైగా రైతులకు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో 370 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ఇప్పటికే 332 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో భానోజీరావు, వ్యవసాయాధికారి భాస్కరరావు, అదనపు ఎస్ఐ భాస్కరరావు సోమవారం విలేకర్ల సమావేశంలో ప్రకటించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎ.కొత్తపల్లిలో

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లి రైతు సేవా కేంద్రంలో సోమవారం యూరియా పంపిణీ చేయడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. ఉదయం 8 గంటల నుంచే రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి బారులు తీరారు. వ్యవసాయ సిబ్బంది చేరుకుని టోకెన్ జారీ చేసి పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీని ప్రారంభించారు. టోకెన్ల జారీ సమయంలో గందరగోళం నెలకొంది. ముందుగా వచ్చిన వారు కాకుండా ఆలస్యంగా వచ్చిన కొందరు రైతులు టోకెన్లు తీసుకున్నారని స్థానిక రైతులు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది.

కొనసాగుతున్న యూరియా కొరత

మాడుగుల: యూరియా కొరత మాడుగులలో కొనసాగుతోంది. గ్రోమోర్ షాపునకు సోమవారం వచ్చిన రైతులకు నిరాశ ఎదురైంది. ఈ విషయమై వ్యవసాయాధికారి అనసూయను సంప్రదించగా.. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 861 మెట్రిక్ టన్నులు మండలానికి రావలసి ఉండగా.. ఇంత వరకు 485 మెట్రిక్ టన్నులు వచ్చిందన్నారు.

బ్లాక్ మార్కెట్‌లో అధిక రేట్లకు విక్రయాలు

నాతవరం: ఖరీఫ్ పంట సాగు చేసే రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాతవరం మండలంలో సుమారుగా 7 వేలు హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా ఎరువులు అందుబాటులో ఉంచలేదు. రైతు సేవా కేంద్రాల్లో, ప్రైవేటు డీలర్ల వద్ద రైతుకు ఒక బస్తా మాత్రమే ఇస్తున్నారు. భూమికి తగ్గట్టుగా ఎరువులు ఇవ్వలేమని అధికారులు, ప్రైవేటు డీలర్లు తేల్చి చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో, ప్రైవేటు దుకాణాల్లో దొరకని ఎరువులు బ్లాక్ మార్కెట్లో కావలసినంతా విక్రయిస్తున్నారు. బస్తా ఒక్కంటికి రూ.150 నుంచి రూ.200 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఇటీవల మండలంలో కొందరు రైతులు జిల్లా వ్యవసాయాధికారికి ఫోన్ ద్వారా ఎరువులు అధిక రేట్లకు విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు లేవని రైతులు మండిపడుతున్నారు.

మండలంలో వరి, పామాయిల్, జీడిమామిడి తోటలకు కావలసిన ఎరువులు

- ఈ ఏడాది మొత్తం కావలసిన ఎరువులు 2,200 టన్నులు
- ఇంత వరకు సరఫరా చేసిన ఎరువులు 650 టన్నులు
- దాంట్లో యూరియా 350 టన్నుల పంపిణీ
- అన్ని రకాల ఎరువులు మండలానికి 1000 టన్నుల కావాలని ప్రతిపాదనలు చేశారు
- అందులో యూరియా 300 టన్నులు అవసరం


రైతుకు ఒక్క బస్తా యూరియా అందిస్తున్న నాతవరం గ్రోమోర్ దుకాణం

క్లుప్తంగా

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల గుర్తింపు శిబిరం రేపు

నర్సీపట్నం: ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఉచిత ఉపకరణాల గుర్తింపు నిర్ధారణ శిబిరం బుధవారం నర్సీపట్నం ఐదు రోడ్లు జంక్షన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు ఎంఈవో సిహెచ్.తలుపులు తెలిపారు. నియోజకవర్గంలోని నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం మండలాల నుంచి 1 నుండి 18 ఏళ్లలోపు దివ్యాంగ విద్యార్థులు హాజరు కావచ్చన్నారు. ఈ శిబిరంలో ఏపీసీ జయప్రకాష్, ఈఈడీ కోఆర్డినేటర్ బి.రామకృష్ణ, మండల స్పెషల్ ఎడ్యుకేటర్స్ బి.అప్పారావు, ఆర్.నాయుడుబాబు, టి.మాణిక్యం, సాలాపు దేవుడునాయుడు, వైద్య సిబ్బంది పాల్గొంటారని ఎంఈవో పేర్కొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అవసరం

మాకవరపాలెం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నేషనల్ క్వాలిటీ ఇష్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్యూఏఎస్) టీం సభ్యుడు మణికంఠ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని జీ.కోడూరులో ఉన్న విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ క్లీనిక్‌లో గర్భిణులు, రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి అమలు చేస్తున్న పథకాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం మణికంఠ మాట్లాడుతూ మెరుగైన సేవలు అందించేందుకు ఈ టీంలు పనిచేస్తాయన్నారు. వీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రులను తనిఖీలు చేసి, కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సీతారామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

రావికమతం: కొత్తకోట బీసీ వసతి గృహంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 90 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. నలుగురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. వంటశాల, భోజన శాల, మరుగుదొడ్లను వైద్యాధికారి సురేఖ పరిశీలించారు. మరుగుదొడ్లను శుభ్రం చేయించాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు.

హైస్కూల్‌కు మైక్‌సెట్ వితరణ


మైక్ సెట్ అందిస్తున్న కోటేశ్వరరావు

కె.కోటపాడు : చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు తోడ్పాటు అందిస్తుండడం అభినందనీయమని ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శేఖర్ అన్నారు. ఎ.కోడూరు హైస్కూల్‌లో 1988–89 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సోమవారం రూ.35 వేలు విలువైన మైక్ సెట్‌ను సమకూర్చారు. దీనిని పాఠశాల హెచ్ఎంకు పూర్వ విద్యార్థి లెక్కల కోటేశ్వరరావు అందజేశారు. పూర్వ విద్యార్థులను హెచ్ఎం అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

నర్సీపట్నం: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపకార్యదర్శి జి.గౌతమ్ ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ. 6700 కోట్లు వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాల, కాలేజీలలో విద్యార్థి సంఘాలకు అనుమతిని ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చలో విజయవాడ కార్యక్రమంలో విద్యార్థులపై ప్రభుత్వం పోలీసులచే లాఠీచార్జి చేయించటం దారుణమన్నారు. ప్రభుత్వానికి చేతనైతే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అంతే కానీ ప్రశ్నించిన విద్యార్థులను శిక్షించడం మంచి పద్ధతి కాదన్నారు.

తూటిపాలలో అక్షరాస్యత దినోత్సవం

మాకవరపాలెం: ప్రతి మనిషినీ మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దేది చదువు ఒక్కటేనని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం సుధామాధవి అన్నారు. పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అక్షర జ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత శాస్త్ర సాంకేతికతలు అర్థం చేసుకుంటూ మరింత జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అక్షరం విలువను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కె.రాము, లోవరాజు పాల్గొన్నారు.

కేజీబీవీలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

దేవరాపల్లి: బేతపూడి కేజీబీవీలో నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం ప్రారంభించారు. వైజాగ్‌కు చెందిన రౌండ్ టేబుల్ 77 స్వచ్ఛంద సంస్థ సభ్యులు స్థానిక కేజీబీవీలోని ల్యాబ్‌కు 10 కంప్యూటర్లను అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం కంప్యూటర్లను సమకూర్చిన సంస్థ సభ్యులను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకుడు బండారు అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ చల్లా లక్ష్మి, కేజీబీవీ ప్రిన్సిపాల్ సిహెచ్.భువన మాధురి పాల్గొన్నారు.

క్వారీ బ్లాస్టింగ్‌తో బీటలు వారుతున్న ఇళ్లు

- ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన క్వారీ బాధితులు
- పీజీఆర్ఎస్‌లో 22 అర్జీలు


క్వారీలో బ్లాస్టింగ్ నిలుపుదల చేయాలని ఆర్డీవో రమణను కోరుతున్న బాధితులు

నర్సీపట్నం: రోలుగుంట మండలం శరభవరం రెవెన్యూ పరిధిలోని నల్లరాయి క్వారీల్లో బాంబ్ బ్లాస్టింగ్‌లతో ఇళ్లు బీటలు వారుతున్నాయని క్వారీకి సమీపంలో ఉన్న రాజన్నపేట గ్రామస్తులు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో వి.వి.రమణకు ఫిర్యాదు చేశారు. బ్లాస్టింగ్ వల్ల ఇళ్లు సన్‌షేడ్‌లు, ఇళ్లల్లో టీవీలు పాడవుతున్నాయని బాధితులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు ఆర్డీవోకు విన్నవించారు. ఇల్లు కోల్పోయిన బాధితులను తక్షణమే ఆదుకోవాలని, బ్లాస్టింగ్‌లు నిలుపుదల చేయాలని కోరారు. ఈ విషయాన్ని ఇది వరకే మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. పరిశీలన చేసి చర్యలు తీసుకుంటానని ఆర్డీవో బాధితులకు హామీ ఇచ్చారు. తన నాలుగేళ్ల కుమారుడు వైశిక్ కుమార్ నలందా స్కూల్‌లో యూకేజీ చదువుతున్నాడని, సరిగా మాటలు రావని, ఈ నెల 6న మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వచ్చేశాడని రఘు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. స్కూల్ యాజమాన్యంపై విచారణ జరిపి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తం 22 అర్జీలు వచ్చాయని ఆర్డీవో తెలిపారు. ప్రతి సమస్యను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు.

సకాలంలో వ్యవసాయ రుణాలు మంజూరు

కె.కోటపాడు : రైతులకు సకాలంలో వ్యవసాయ రుణాలను అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు తెలిపారు. మండలంలో చౌడువాడ పీఏసీఎస్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పీఏసీఎస్‌లలో మౌలిక వసతుల కల్పనకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ రాజి నారాయణమూర్తి, డీసీసీబీ జీఎం శ్రీనివాస్, డీజీఎం శ్రీనివాసరావు, ఏజీఎం కిషోర్, సీఈవో బత్తిన సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

నేడు అన్నదాత పోరు



- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మంగళవారం ఆర్డీవో కార్యాలయం వద్ద అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించనున్నామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు ఉదయం 10 గంటలకు మున్సిపల్ స్టేడియంకు చేరుకోవాలన్నారు. అక్కడ గాంధీ విగ్రహానికి, అనంతరం అబీద్‌సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

గొలుగొండ: నర్సీపట్నంలో ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం జరిగే అన్నదాత పోరు కార్యక్రమంను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొరుప్రోలు ఫాణీశాంతారామ్ కోరారు. ఇప్పటికే మండలంలో ఉన్న 29 పంచాయతీల్లో రైతుల యూరియా సమస్యలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు.

నాతవరం: రైతు సమస్యలపై తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి కోరారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కరక అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగినలో సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స, నాతవరం సర్పంచ్ గొలగాని రాణీ, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టరు పైల పోతురాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెక్కా జోగిరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు, హైస్కూల్ విద్యా కమిటీ మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు, పార్టీ నాయకుడు అపిరెడ్డి మహేష్ పాల్గొన్నారు.

మాడుగుల: జిల్లా కేంద్రం అనకాపల్లిలో మంగళవారం ఉదయం 9 గంటలకు అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్ తెలిపారు. సోమవారం ఆయన మాడుగులలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ పాలిమేర విజయలక్ష్మి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ జవ్వాది వరహాలు, కొసిరెడ్డి కృష్ణమూర్తి, పెరుమళ్ళ వెంకటరావు, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా పాల్గొన్నారు.

చోడవరం: అన్నదాత పోరు వాల్ పోస్టర్లను చోడవరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. అనకాపల్లి ఆర్డీవో కార్యాలయానికి మంగళవారం ఉదయం 10 గంటలకు రైతులంతా పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, డీఆర్‌యూసీ సభ్యుడు బొడ్డు శ్రీరామమూర్తి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, పట్టణ అధ్యక్షురాలు అల్లాడ భవానీ, శివాలయం మాజీ చైర్మన్ గూనూరు సత్తిబాబు, మండల యూత్ అధ్యక్షుడు పల్లా ధనాజీ, స్టూడెంట్ విభాగం ప్రతినిధి బూరా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: అన్నదాత పోరును విజయవంతం చేయాలని కోరుతూ జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ సోమవారం పోస్టరును ఆవిష్కరించారు. పార్టీ నాయకుడు పోతల లక్ష్మీ నివాస్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకట్రావు, తాతబాబు, పార్టీ నాయకులు పిల్లి శ్రీను, కాళ్ల నాయుడు పాల్గొన్నారు.

చీడికాడ: అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించనున్న అన్నదాత పోరు విజయవంతం చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండలఅధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు బైలపూడి, చీడికాడలలో రైతులతో కలిసి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, వైస్ ఎంపీపీ స్వాతికొండబాబు, యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, పరువాడ మహేష్ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరణలో అనురాధ, జగన్‌మోహన్

ఎరువుల సరాఫరాలో ప్రభుత్వం విఫలం

కె.కోటపాడు : రైతులకు సకాంలో ఎరువులను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ ధ్వజమెత్తారు. కె.కోటపాడులో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, పార్టీ నాయకులతో కలిసి అన్నదాత పోరు పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం చేపడుతున్న అన్నదాత పోరు కార్యక్రమానికి పార్టీ నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా రాజేశ్వరరావు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, లెక్కల గోపి, పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఆకుల సాయి ప్రసాద్, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు పాల్గొన్నారు.


నాతవరం: పార్టీ శ్రేణులతో సమావేశమైన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఎంపీపీ లక్ష్మణమూర్తి, జిల్లా నాయకుడు అప్పలరాజు


చోడవరంలో వాల్ పోస్టర్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మాడుగులలో అన్నదాత పోరు వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు


రోలుగుంటలో అన్నదాత పోరు పోస్టరును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ లక్ష్మీరమణమ్మ


బైలపూడిలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆలయాల్లో సంప్రోక్షణ పూజలు

మాడుగుల రూరల్: చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం మూసివేసిన ఆలయాలను సోమవారం ఉదయం తెరిచారు. అనంతరం ఆలయంలో సంప్రోక్షణ చేసి, పూజలు నిర్వహించారు. భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రహ పరిహార దోషాలకు బ్రాహ్మణులకు దానాలు ఇచ్చారు. ఎం.కోడూరు, కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు పూజలు నిర్వహించారు. కె.జె.పురం, వి.వి.అగ్రహారం, జంపెన, కె.జె.పురం జంక్షన్‌లోని మహంకాళేశ్వర స్వామి ఆలయంతో పాటు మాడుగులలో శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. తాచేరు, శారదా నదుల్లో భక్తులు స్నానాలు ఆచరించారు.

చోడవరం: చోడవరం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయంతో పాటు స్వయంభూ గౌరీశ్వర స్వామి ఆలయం, కేశవస్వామి, వేంకటేశ్వరస్వామి, వెంకన్నపాలెం సాయిబాబా ఆలయాలు సంప్రోక్షణ అనంతరం స్వామివారి పునర్దర్శనానికి తెరిచారు. స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో పలువురు ప్రత్యేక పూజలు, దానాలు చేశారు.


చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


కె.జె.పురం శివాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న ప్రధానార్చకులు

అనధికార ఎరువుల విక్రయాలపై దాడులు

రావికమతం: మండలంలో అనధికార ఎరువుల విక్రయాలపై విజిలెన్స్, పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 4.9 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. తట్టబందకు చెందిన వ్యాపారి కుండేలా అప్పారావు స్థానిక చెరకు కాటాకు సమీపంలో బలిజిపాలెం దగ్గర్లోని దుకాణంలో ఎరువులను భారీగా నిల్వ చేసి ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. గతంలో నిషేధించిన 17-17-17 రకం ఎరువును కూడా బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఎరువుల దుకాణంకు సంబంధించి లైసెన్సు, ఎటువంటి అనుమతులు లేవు. ఈ నేపథ్యంలో రైతుల నుంచి ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ బాబు, రావికమతం ఎస్ఐ రఘువర్మ, వీఆర్వో బాలాజీ సోమవారం సాయంత్రం కుండేల అప్పారావు అనధికార ఎరువుల దుకాణంపై దాడులు నిర్వహించి, అక్రమ నిల్వలను సాధీనం చేసుకుని, దుకాణంను సీజ్ చేశారు. వ్యాపారి అప్పారావుపై చట్టపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్స్ చేయనున్నట్టు ఏవో రమేష్‌బాబు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాగజ్యోతికి సత్కారం


నాగజ్యోతిని సత్కరిస్తున్న హెచ్ఎం శేషగిరిరావు

రోలుగుంట: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చిన ఇంగ్లిష్ టీచర్ పీవీఎం నాగజ్యోతికి సోమవారం విద్యార్థులు బ్యాండు మేళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమెను హెచ్ఎం శేషగిరిరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు.

ఈనాం భూసమస్యకు పరిష్కారం చూపాలి

- ఎమ్మెల్యే బండారు దృష్టికి తీసుకెళ్లిన వైస్ ఎంపీపీ సూర్యనారాయణ
- విద్యుత్ చార్జీల పెరుగులపై సమాధానమివ్వండి: జెడ్పీటీసీ అనురాధ
- కె.కోటపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


ఈనాం భూముల సమస్యపై మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ

కె.కోటపాడు : పాచిలవానిపాలెం, చౌడువాడ గ్రామాల్లో రైత్వారీ ఈనాం భూముల సమస్యకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలను తీసుకోవాలని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి ఈనాం భూసమస్యను వైస్ ఎంపీపీ తీసుకెళ్లారు. సుమారు వందేళ్ల నుంచి పాచిలవానిపాలెం, చౌడువాడ గ్రామాల్లో సుమారు 500 కుటుంబాలకు చెందిన వారు ఈ రైత్వారీ ఈనాం భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. 2015 తరువాత రెవెన్యూ రికార్డుల్లో ఈనాం భూముల పేరును మార్పు చేసి సత్రం పేరును నమోదు చేశారని సూర్యనారాయణ తెలిపారు. ఈ కారణంగా ఈ భూములపై ఎండోమెంట్ అధికారులు తమ పేరున పాస్ పుస్తకాలు చేయాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నారన్నారు. ఈ భూములకు పట్టాలు ఇవ్వాలని రైతులు హైకోర్టును ఆశ్రయించామని ఆయన చెప్పారు. హైకోర్టు కూడా రైతులకు అనుకూలంగా ఆదేశాలు జారీ చేసిందని, అయితే నేటికి అమలు కాలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు మేలు చేసేలా చర్యలను తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యేకు వైస్ ఎంపీపీతో పాటు సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ వినతిపత్రం అందజేశారు. జెడ్పీటీసీ ఈర్లె అనురాధ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ చార్జీలు ఎందుకు పెరుగుతున్నాయో విద్యుత్ శాఖాధికారులు వినియోగదారులకు సమాధానం చెప్పాలన్నారు. దీనిపై ఎలక్ట్రికల్ సబ్ ఇంజినీర్ ఎం.నాయుడు మాట్లాడుతూ విద్యుత్ యూనిట్ చార్జీల ధరలు ఏమీ పెరగలేదని, ఇంధన చార్జీల ధరలు పెరిగినట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తోడ్పాటు అందించనున్నట్టు ఆమె తెలిపారు. రైతులు చెరకు సాగును ఎందుకు తగ్గించారో సభకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలపాలని అనురాధ డిమాండ్ చేశారు. గతేడాది చెరకు తరలించినా ఇప్పటికీ బిల్లులు పూర్తి స్థాయిలో ఇవ్వనందున రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మరలినట్లు ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ తెలిపారు. సూదివలస, మర్రివలస గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల నుంచి ఆయా గ్రామాల రైతులకు యూరియాను ఇప్పించాలని ఎంపీటీసీ సభ్యుడు వర్రి రామునాయుడు కోరారు. సూదివలస–పాతవలస మధ్య అసంపూర్తిగా ఉన్న తారు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. వి.సంతపాలెంలో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం పూర్తయినా నేటికి విద్యుత్ మీటర్‌ను ఏర్పాటు చేయలేదని సర్పంచ్ లెక్కల దేవీలత తెలిపారు. మండలంలో రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్, ప్రైవేట్ డీలర్ల ద్వారా ఖరీఫ్ సాగు కాలానికి ప్రస్తుతం 713 మెట్రిక్ టన్నుల యూరియాను అందించినట్లు మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సాంబశివరావు, తహసీల్దార్ బుజంగరావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, సూపరింటెండెంట్ అప్పలరాజు, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, ఎంపీటీసీలు చీపురపల్లి అచ్చిబాబు, నెక్కల గోపి, పల్లా కన్నమ్మ, యడ్ల రేవతి, గొర్రుపోటు రామలక్ష్మి, రొంగలి లక్ష్మి, వంటాకు నారాయణమ్మ, కశిరెడ్డి దేముడుబాబు, సర్పంచ్‌లు బండారు దేముళ్ళు, బోళం సందీప్, బొడ్డు అక్కునాయుడు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.